క్లుప్తంగా

2 నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్ అమలులోకి వస్తాయని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వివేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు 24 స్లాట్లు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 24 స్లాట్లు మొత్తం మీద రోజుకు 48 స్లాట్లు అందుబాటులో ఉంటాయన్నారు. బుకింగ్ చేసుకున్న వారికి త్వరలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. దీన్ని వేగవంతం చేయడానికి వేలి ముద్రలతో పాటు సంతకం కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానం


బలరాం జాదవ్‌ను ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని తర్నం(కె) గ్రామంలో జూన్ 3న చేపట్టనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రావాలని లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్‌ను గ్రామస్తులు కోరారు. గురువారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అంబేడ్కర్ స్ఫూర్తితో గ్రామాభివృద్ధి, విద్యా పురోగతికి దోహదపడే లక్ష్యంతో విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

దత్తు మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దత్తు మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తరోడ వంతెన వద్ద వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. వంతెన పనులు నత్తనడకన చేపడుతున్న కాంట్రాక్టర్ సైతం బాధ్యత వహించాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

'కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

సాత్నాల: భోరజ్ మండలంలోని తార్నాం వంతెనను సీపీఎం ఆదిలాబాద్ ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దత్తు తాత్కాలికంగా నిర్మించినలో లోలెవల్ వంతెన దాటుతూ నీటి ప్రవానికి కొట్టుకుపోయి మరణించటం బాధాకరమన్నారు. అతని మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించి, రూ. 25 లక్షల రూపాయల పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలి

బోథ్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలోని 3వ వార్డులో ఉన్న సామూహిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు వెంకటేశ్ గురువారం గ్రామ పంచాయతీ ఈవో అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. మరుగుదొడ్లను నాసిరకంగా నిర్మించడంతో వాటి తలుపులు విరిగి, పై కప్పు రేకులు పడిపోయాయన్నారు. వర్షాలు కూడా పడి అక్కడికి వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. మరుగుదొడ్లను శుభ్రం చేయించి మొరం వేయించాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


ప్రవచనాలు బోధిస్తున్న బాలు మహారాజ్

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ మందిర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కలశంతో గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం మహారాష్ట్రకు చెందిన బాలు మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనలు బోధించారు. ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపటేల్ పాటులే పుండలిక్, గ్రామస్తులు జవాదే కేశవ్, కరాడే మారుతి, పోటే సాయినాథ్, నాందేవ్, సంతోష్, ప్రకాష్, గజానంద్ పాల్గొన్నారు.

బేల: మండలంలోని సిర్సన్న గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్యన హోమం, ధ్వజస్తంభం, గణపతి, శివలింగం, గౌరి, నాగ, నంది, నవగ్రహాలు, మార్కండేయ విగ్రహాల ప్రతిష్ఠించారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తన వంతుగా రూ.21వేలు విరాళంగా అందజేశారు.

మెప్మా మేడ్.. శానిటరీ ప్యాడ్స్


న్యాప్‌కిన్స్ తయారీ చేసే మిషన్లు

- మహిళాశక్తి కింద యూనిట్ మంజూరు
- తయారీకి మహిళా సంఘాల కసరత్తు
- రేపు మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభం

కైలాస్‌నగర్: మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) వారి ఆరోగ్యంపైన ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం కింద శానిటరీ ప్యాడ్స్ (న్యాప్‌కిన్) తయారీకి శ్రీకారం చుట్టనుంది. ఇందుకోసం పట్టణానికి చెందిన మహిళ సంఘాన్ని ఎంపిక చేసింది. న్యాప్‌కిన్స్ తయారీకి అవసరమైన మిషనరీ కొనుగోలు కోసం పీఎంఈజీపీ పథకం కింద రూ.15లక్షల ఆర్థిక చేయూతనందించింది. దీంతో ఆ సంఘ సభ్యులు మిషనరీ కొనుగోలు చేసి తయారీకి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. శానిటరీ ప్యాడ్స్ తయారీ యూనిట్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈనెల 31న ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలు తలెత్తకుండా..

మహిళల రుతుస్రావం సమయంలో అవసరమైన శానిటరీ ప్యాడ్స్ వాడకం ఇటీవల పెరిగినప్పటికీ ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో పాత పద్ధతులనే అవలంబిస్తున్నారు. కొంత మంది పేదరికం కారణంగా వాటి జోలికి వెళ్లడం లేదు. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వాటికి చెక్‌పెట్టడంతో పాటు తక్కువ ధరకు ప్యాడ్స్‌ను అందించాలనే ఉద్దేశంతో ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన భీంజ్యోతి మహిళ సంఘం న్యాప్‌కిన్స్ తయారీకి ముందుకు వచ్చింది. బ్యాంకు లింకేజీ కింద రూ.15లక్షల ఆర్థిక సాయంతో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పాత కార్యాలయ భవనంలో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సంఘంలో పది మంది సభ్యులు ఉన్నారు. గంటలో 600 ప్యాడ్స్ తయారు చేసే మిషనరీలతో పాటు ప్యాకింగ్‌కు అవసరమైన మిషనరీలను సైతం తెప్పించి సిద్ధం చేశారు.

వసతిగృహాలు, పాఠశాలలకు సరఫరా..

శానిటరీ ప్యాడ్స్ మార్కెటింగ్ చేసే దిశగా ప్రత్యేక కార్యచరణను సిద్ధం చేశారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు, ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు సరఫరా చేయడంతో పాటు స్థానికంగా ఉన్నటువంటి సూపర్ మార్కెట్లలోనూ అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వారితో సంప్రదింపులు చేశారు. అలాగే ప్రభుత్వరంగ సంస్థలైన సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీలు, రిమ్స్ ఆస్పత్రితో పాటు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సైతం వాటిని తక్కువ ధరకు అందించేలా ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందుకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు ప్రతిపాదనలు పంపించారు. కలెక్టర్ అంగీకారం తెలిపితే ఆయా సంస్థలకు మెప్మా ద్వారా ఈ శానిటరీ న్యాప్‌కిన్స్ సరఫరా చేయనున్నారు.

మహిళ అభివృద్ధికి దోహదం



మహిళల ఆరోగ్యానికి అండగా నిలిచేలా స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో న్యాప్‌కిన్ తయారీ యూనిట్‌ను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సంఘం ద్వారా తయారు చేసే నాణ్యమైన ప్యాడ్స్ తక్కువ ధరకు అందనున్నాయి. దీంతో మహిళల ఆరోగ్యంతో పాటు సంఘ సభ్యుల అభివృద్ధికి దోహదపడుతుంది.

– కె.శ్రీనివాస్, మెప్మా డీఎంసీ

రైతులను మోసం చేస్తే చర్యలు


పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి: ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకులు నాసిరకం విత్తనాలతో రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంతో పాటు ముత్నూర్, ధన్నోర గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. దుకాణదారులను స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విత్తన, ఎరువులు రైతులకు అమ్మేటప్పుడు ప్రతీ రైతుకు కచ్చితంగా రసీదు ఇవ్వాలన్నారు. రైతు సంతకం, ఫోన్ నెంబర్ తీసుకోవాలన్నారు. డీలర్లు విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగుల మందులు సమగ్ర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి రాథోడ్ గణేష్, ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ వివరాలు బోర్డుపై ఏర్పాటు చేయాలి

తాంసి: విత్తనాల దుకాణాల యాజమానులు దుకాణంలో విత్తనాల స్టాక్ వివరాలు బోర్డుపై నమోదు చేయాలని తహసీల్దార్ లక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని పొన్నారి గ్రామంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. విక్రయించడానికి సిద్ధంగా ఉన్న పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. దుకాణ యజమానికి పలు సూచనలు చేశారు. వారి వెంట రైతులు లక్ష్మిపతి, అశోక్, ఆనంద్, తదితరులు ఉన్నారు.


పత్తి విత్తనాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

తొందర పడి విత్తనాలు నాటొద్దు

బజార్‌హత్నూర్: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాగులో తొందర పడి విత్తనాలు నాటొద్దని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ రైతులకు అన్నారు. గురువారం మండలంలోని ధరంపురి గ్రామంలో ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయని సంమృద్ధిగా వర్షాలు కురిసిన తర్వాత ఖరీఫ్ సాగు ప్రారంభించాలన్నారు. ప్రతిఏడాది పంట మార్పిడి, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు తర్వాత రసీదులు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త శివచరణ్, ఏవో మహ్మద్ సాద్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజశేఖర్

ఫ్రెండ్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

బోథ్: మండల కేంద్రంలోని షాదీఖానాలో గురువారం ఫ్రెండ్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వైద్య సురేశ్, ప్రధాన కార్యదర్శిగా బుస లక్ష్మణ్, కోశాధికారిగా కొట్టాల రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్క రాజు, వెల్మ సూర్య ప్రకాష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మునీర్ హైమద్, రాసం నవీన్ కుమార్, మాసం అనిల్ కుమార్ , కార్యవర్గ సభ్యులుగా మెరుగు భోజన్న, వెంకటేశ్, చట్ల ఉమేష్, గణేష్, గంగయ్య, విలాస్ రెడ్డి, ఆర్.విశ్వనాథ్, సలహాదారులుగా శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌బాబు, సురేందర్ యాదవ్, రవీంద్ర ప్రసాద్, ఆర్‌టీవీ ప్రసాద్, దివాకర్ రెడ్డిని ఎన్నుకున్నారు.


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తెలంగాణ ఎలక్ట్రిసిటీ యూనియన్ (327)..

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ యూనియన్ (327) ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘం జిల్లా, ఆదిలాబాద్, ఉట్నూర్ డివిజన్ కార్యవర్గాలను బుధవారం రాత్రి ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ తరంగిణిలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగుల శ్రీధర్ హాజరయ్యారు. రీజినల్ కార్యదర్శిగా మోసం రమేశ్, అధ్యక్షుడిగా జూమిడి మధుకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాగుల శ్రీనివాస్, మోసిన్ ఖాన్, కోశాధికారిగా గుమ్మల రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా నల్లపు ప్రశాంత్, కోశాధికారిగా రాజేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నరేశ్, లాలు శ్రీరామ్, కోశాధికారిగా రామకృష్ణ, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడిగా రాగుల వెంకటయ్య, కార్యదర్శులుగా రాగుల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా రాథోడ్ రవీందర్, సుమన్, కోశాధికారిగా రాథోడ్ రవీందర్, రవీందర్‌లను ఎన్నుకున్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బోథ్: సొనాల మండల కేంద్రంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది హెచ్‌ఐవీపై గురువారం అవగాహన కల్పించి, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ.. మొబైల్ ఐసీటీసీ వాహనాల్లో ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీ సోకిన తల్లికి, పుట్టిన బిడ్డకు ఆరు వారాలకు, ఆరు నెలలకు, 18 నెలలోపు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది లింగారెడ్డి, నాగరాజు, రంజిత్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాజుల పోతన్న,ప్రకాష్ పద్వాల్, రేణుకబాయ్ ఉన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 67 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు, మాజీసర్పంచులు, ఎంపీటీసీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గడువు పొడిగించాలి

బోథ్: జొన్న కొనుగోళ్లను 15 రోజులు పొడిగించాలని బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మేడిచెల్మ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బోథ్ మండల పరిధిలోని రైతులందరూ తమ జొన్న పంటను అమ్ముకోవడానికి 29వ తేదీ ఆఖరు అని అధికారులు ప్రకటించడం సరికాదన్నారు. చాలా మంది రైతులు జొ న్న పంటను ఇంకా అమ్ముకోలేదన్నారు. ఇప్పటివరకు జొన్న పంట అమ్మిన రైతుల అకౌంట్లో డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేల: మండలంలోని సదల్‌పూర్ గ్రామంలోని ఇంగ్లిష్ మీడియం ఎస్టీ బాలికలు మినీ గురుకులం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ మాల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–56 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో 30సీట్లు, ఐదో తరగతిలో 10 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల గిరిజన బాలికలు వచ్చే నెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలలను సొనాల కాంప్లెక్స్‌లో చేర్చాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: బోథ్ నుంచి సొనాల మండలంగా ఏర్పడిన నేపథ్యంలో గుర్రాలతండా, కౌఠ (కె), సొకెర, సూర్యనగర్, ఘన్‌పూర్ గ్రామాల్లోని ఎంపీపీఎస్ పాఠశాలలు బోథ్ మండలంలోని కౌఠ(బి) కాంప్లెక్స్ పరిధిలోనే ఉన్నాయని, సొనాల కాంప్లెక్స్‌లోకి మార్చాలని తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు గురువారం ఎమ్మెల్సీ కొమురయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి


మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నార్నూర్: ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశం హాల్‌లో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను కోరగా.. రెండు రోజుల క్రితం గిరిజన సంక్షేమశాఖ నుంచి గిరిజనులకు 4వేల ఇళ్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీ పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందనే ఆరోపించారు. అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి అర్హులకు మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్నా.. ఇప్పటి వరకు ఎమ్మెల్యేలకు రావాల్సిన సీడీఎఫ్ గ్రాండ్ మంజూరు చేయలేదన్నారు. అటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయక ఇటు ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో గంగాసింగ్, ఎంపీవో సాయిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ శ్యాం సుందర్, ఫాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, మాజీ వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఉర్వేత రూప్‌దేవ్, సయ్యద్ ఖాసీం, విష్ణు ఫడ్, మాడవి రూప్ దేవ్, కనక ప్రభాకర్ పాల్గొన్నారు.

జొన్న కొనుగోళ్ల గడువు పెంచండి


కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నార్నూర్: కలెక్టర్ గారు.. జొన్న కొనుగోలు గడువును వచ్చే నెల 10 వరకు పెంచండి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులు జొన్న పంటను తీయలేకపోయారని దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సెల్‌ఫోన్ ద్వారా వివరించారు. గురువారం మండల పర్యటనకు వచ్చిన ఆమె గంగాపూర్ గ్రామంలో రైతులు కలిసి జొన్న పంటను పరిశీలించారు. వర్షానికి జొన్న తడిసి మొలకలు రావడంతో రైతులు భారీగా నష్టపోయారని, కనీసం ఉన్న పంటను మార్కెట్‌లో అమ్మేలా గడువును పెంచాలని ఎమ్మెల్యేను రైతులు కోరగా ఆమె వెంటనే జిల్లా కలెక్టర్‌కు సమస్యను వివరించారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఈనెల 8వ వరకు గడువును పెంచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోథ్: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, జాతీయ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రభుత్వం తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని బోథ్ మండల పద్మశాలి సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఐదుసార్లు శాసనసభ్యులుగా ఎన్నికై డిప్యూటీ స్పీకర్ క్యాబినెట్ మంత్రిగా సేవలందించిన కొండ లక్ష్మణ్ బాపూజీ ఎంతో మందికి ఆదర్శమన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఫ్రెండ్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆసాల సదాశివ్, గంగుల మల్లేష్, మెరుగు భోజన్న, అనిల్ కుమార్, ఆడేపు కిరణ్, సగ్గం దాస్, లక్ష్మణ్, వెంకటేశ్, దయాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

తలమడుగు: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్ అన్నారు. గురువారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మండలంలోని దేవాపూర్, బరంపూర్, తలమడుగు, సుంకిడి గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, గంగాధర్, గంగన్న, కళ్యాణం రాజేశ్వర్, సునీత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'భీం చౌక్ కుదించడం సరికాదు'


నిరసన తెలుపుతున్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని భీం చౌక్‌లో ఏర్పాటు చేసిన సర్కిల్‌ను కుదించడం సరికాదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. చౌక్‌ను కుదించడాన్ని నిరసిస్తూ గురువారం కుమురంభీం చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్య ఏర్పడి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయనే నెపంతో చౌక్‌ను కుదించడం సరికాదన్నారు. ఆదివాసీ సంఘాలు, రాయి సెంటర్‌తో చర్చించకుండానే ఆదిలాబాద్ మున్సిపాలిటీ అధికారులు అక్కడున్న సర్కిల్‌ను కుదించడం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కుమురంభీం చౌక్‌లో గల సర్కిల్‌ను యథావిధిగా ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు వేట్టి మనోజ్, కుర్సెంగ యాదవ్ రావు, కోడప సోనేరావు, కుంర శ్రీనివాస్, కుంర జంగు, కుంర రాజు పటేల్, సలాం వరుణ్, మర్సకోలా అశోక్, మడవి గణేష్, ఆత్రం గణపతి, అత్రం భుజంగరావు, కుంర ఇసురు పటేల్, మోతిరాం పాల్గొన్నారు.

మద్దతు ధర పెంచడం హర్షణీయం

ఆదిలాబాద్‌టౌన్: రైతులు పండించిన పంటలకు కేంద్రం మద్దతు ధర పెంచడం సంతోషంగా ఉందని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు దయాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్ర ధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరా భిషేకం నిర్వహించారు. రైతుల సంక్షేమం కో సం కేంద్రం పంటలకు మద్దతు ధర పెంచడం హర్షణీయమన్నారు. 2014 కంటే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో స్వామినాథన్ కమీషన్ అమలు చేయలేదన్నారు. పంటకు రూ.100 వరకే పెంచారని అన్నారు. 2014లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతీ పంటకు రూ.వెయ్యి వరకు పెంచారని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా నాయకులు రవీందర్, విఠల్, కార్తీక్, నాగోరావు, సత్యం, నారాయణ, రాము, జైతు, శేకు పాల్గొన్నారు.

జైనథ్‌లో నీటి కష్టాలు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

జైనథ్ : మండల కేంద్రంలో నాలుగు రోజులుగా భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతర్రాష్ట రోడ్డు పనులు జరుగుతున్నందున మిషన్ భగీరథ పైపులైన్ తొలగిపోయింది. దీంతో గ్రామంలోకి నీరు రావడం లేదు. అధికారులు పైపులైన్‌కి మరమ్మతులు చేపట్టి పనులు నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.